# ప్రజాహితుడు

**మా** జమీందారుగారిని యుద్ధం ముందు అమ్మజూపితే కొనేవాళ్లు లేరు. ఆయన ఖర్చు రాబడికి రెట్టింపుండేది. అప్పు జమీందారీకి రమారమిగా ఉండేది. కాని ఇంతలో దేవుడు పంపినట్టు యుద్ధం చక్కావచ్చింది. జమీందారుగారు బాగుపడ్డారు. దాని పుట్టి మునిగినట్టు యుద్ధం కాస్తా అయిపోయింది. జమీందారీలు కూడా పోతాయని ఎవరో ఒక వాదు చేశారు.

జమీందారీ పొలాల్లో ఇటీవల బాగుపడ్డవీ, అనాథల చేతుల్లో ఉన్నవీ సొంతం చేసుకోవాలని జమీందారుగారికి వేవిళ్లు కలిగాయి. పోలీసు డిపార్టుమెంటువారు సహాయం వచ్చారు.

ఫలాని ఊరిప్రజలు జమీందారుమీద యుద్ధం ప్రకటించారనీ, పోలీసులు వచ్చి శాంతి రక్షణలు నెలకొల్పారనీ, చచ్చిన రైతుల సంఖ్యా, వారి భార్యల సంఖ్యా, పిల్లల సంఖ్యా కలుపుకున్నా వందకంటె లేదనీ వార్తలు వచ్చాయి.

"ఎద్దు ముడ్డి పొడుచుకునే వెధవలక్కూడా ఎంతలేసి కొమ్ములొచ్చాయో!" అన్నాడు నా మిత్రుడు.

మరి కొంతకాలం గడిచింది. ఫలాని ఊళ్లో పోలీసులు నెలకొల్పిన శాంతి భద్రతలే గాలికి పడిపోయాయో తెలీదు. మళ్లీ అశాంతి ప్రబలింది. పోలీసులు స్త్రీలను చెరచి చూశారు. దొరికిన వాళ్లందర్నీ చావగొట్టి చూశారు. అర్ధరాత్రివేళ రైతుల ఇళ్లలో జొరబడి దొంగతనాలు చేసి చూశారు. కొంపలకి నిప్పంటించి చూశారు. శాంతిభద్రతలు తిరిగి రానేలేదు.

ఫలాని ఊరి రైతులు మళ్లీ అల్లరి ప్రారంభించారనీ, ఈసారి పాతికమంది పోలీసులు చచ్చారనీ వార్త వచ్చింది.

"రైతుల్నని లాభం లేదు, వాళ్లకు న్యాయం చెయ్యాలిసిందే" అన్నాడు నా అమూల్య మిత్రుడు.

***ముద్రణ : ఆనందవాణి, 27 జూలై 1947***